


నా భర్త మృతదేహాన్ని దేశానికి తీసుకురండి

భార్య వేడుకోలు

ప్రజాశక్తి - జామి

ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన భర్త శవమైపోయాడని తెలుసుకున్న జామి మేజరు పంచాయతీకి చెందిన ఓ నిరుపేద మహిళ.. కలెక్టర్‌ని ఆశ్రయించింది. తన భర్త మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావాలని కోరింది. గత నెల 29న గ్రామంలోని సిహెచ్.మహాలక్ష్మి ద్వారా తన భర్త కొత్తలి బంగారునాయుడుతో కలిసి ముగ్గురు వ్యక్తులు ఉద్యోగం నిమిత్తం దుబాయ్ వెళ్లారని, నెల రోజులు గడవకముందే తన భర్త మరణించారనే కబురు రావడంతో నిర్ఘాంతపోయానని కొత్తలి ఎర్నమ్మ ఆవేదన వ్యక్తంచేశారు. తమది నిరుపేద కుటుంబమని, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, ప్రభుత్వమే ఎలాగైనా తన భర్త మృతదేహాన్ని తీసుకొచ్చే ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ మేరకు జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బండారు పెదబాబుతో కలిసి కలెక్టర్‌కు, జామి తహశీల్దార్ హేమంత్ కుమార్‌కు వినతులు అందజేశారు.

కదంతొక్కిన అంగన్వాడీలు

- మంత్రి బొత్స ఇల్లు ముట్టడికి యత్నం
- పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపై బైఠాయింపు
- తోపులాటలో సొమ్మసిల్లిన అంగన్వాడీ కార్యకర్త
- మద్దతు తెలిపిన సిపిఎం, సిఐటియు నాయకులు
- ప్రభుత్వం తప్పుడు ఆరోపణలు మానుకోవాలి
- ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్



మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంతో రహదారిపై బైఠాయించిన అంగన్వాడీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు కదం తొక్కారు. శనివారం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటి ముట్టడికి యత్నించారు. అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం లేనిపోని ఆరోపణలు చేయడం మానుకోవాలని, లేదంటే తగిన గుణపాఠం చెబుతామని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పైడిరాజు, ఎస్ అనసూయ హెచ్చరించారు. స్థానిక కోట జంక్షన్ నుంచి మూడు లాంతర్లు మీదుగా కోరాడ వీధిలో ఉన్న మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటికి వేలాదిమంది అంగన్వాడీలు ర్యాలీగా చేరుకున్నారు. అప్పటికే డిఎస్‌పి గోవిందరావు ఆధ్వర్యంలో భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి అంగన్వాడీలను మంత్రి ఇంటి వరకు రానివ్వకుండా కొద్ది దూరంలో అడ్డుకున్నారు. దీంతో అంగన్వాడీలు రహదారిపై బైఠాయించారు. మంత్రి బొత్స ఇంట్లో లేరని, కుటుంబ సభ్యులుమాత్రమే ఉన్నారని పోలీసులు తెలిపారు. జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి బొత్స వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ రెండుగంటల పాటు ఆందోళన కొనసాగించారు. పోలీసులు ససేమిరా అనడంతో అంగన్వాడీ కార్యకర్తలు పోలీసులను నెట్టుకుని ఇంటికి వెళ్లేందుకు దూసుకెళ్లారు. దీంతో పోలీసులు అడ్డంగా పెట్టిన స్టాపర్స్‌ను తోసుకుంటూ ముందుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో చీపురుపల్లి మండలం కోనూరు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త కమల సొమ్మసిల్లి పడిపోయారు. ఈనేపథ్యంలో పోలీసులు 50 మంది నాయకులను వెంట తీసుకొని వెళ్లి మంత్రి బొత్స సత్యనారాయణ పిన్నమ్మకు వినతి పత్రం అందజేశారు.

అంతకు ముందు కోట జంక్షన్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించడంతో నగరంలో భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. బొత్స సత్యనారాయణ ఇంటి ముట్టడి కార్యక్రమాన్ని ఉద్దేశించి యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు వి.లక్ష్మి, అధ్యక్ష కార్యదర్శులు బి.పైడిరాజు, ఎస్.అనసూయ, సి ఐ టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె సురేష్,రాష్ట్ర కమిటీ సభ్యులు టివి రమణ, సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడారు. అంగన్వాడీలు 19 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం సమస్యలు పరిష్కరించేశామని చెప్పడం, తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని డిమాండ్ చేశారు. తామేమీ అదనంగా కోరడం లేదని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్నామని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు ఇవ్వడంలేదని అన్నారు.

అంగన్వాడీలకు ఇస్తున్న గౌరవ వేతనం పిల్లలకు పెట్టాల్సి వస్తుందన్నారు. సేవాభావంతో పని చేస్తున్న తమ గురించి ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ఎవరూ లేనప్పుడు కేంద్రాల తాళాలు పగుల కొట్టించిన మీరు బొత్స ఇంటికి వెళ్లేందుకు అడ్డుకునే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే గత ప్రభుత్వాలకు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. ముట్టడి కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.సూర్య నారాయణ, యుఎస్ రవికుమార్, బి.రమణ, మాణిక్యం, శ్యామల, కృష్ణమ్మ వెలాదిగా తరలి వచ్చిన అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పోలీసులు అడ్డుపెట్టిన స్టాపర్లను తోసుకుంటూ ముందుకువెళ్తున్న అంగన్వాడీలు

రామభద్రపురం : స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగా రహదారిపై సిఐటియు మండల కార్యదర్శి బి.శ్రీనివాసరావు ఆధ్వర్యాన అంగన్వాడీలు మానవహారం చేపట్టి, రాస్తారోకో నిర్వహించారు. దీంతో ఇరువైపులా భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది పోలీసులు అక్కడికి చేరుకుని, అంగన్వాడీలకు సర్దిచెప్పి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

బొబ్బిలి : ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలిలో అంగన్వాడీలు మానవహారం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు నిర్మల, కామేశ్వరి, రోజా, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.





బొబ్బిలి, రామభద్రపురంలో మానవహారం, రాస్తారోకో నిర్వహిస్తున్న అంగన్వాడీలు, సిఐటియు నాయకులు

పూసపాటిరేగ ఎఎంసి చైర్‌పర్సన్‌గా చిక్కాల



చిక్కాల అరుణకుమారి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

పూసపాటిరేగ ఎఎంసి చైర్‌పర్సన్‌గా నెల్లిమర్ల మాజీ సర్పంచ్ చిక్కాల అరుణ కుమారిని నియమిస్తూ పార్టీ అధిష్టానం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అరుణ కుమారి భర్త చిక్కాల సాంబశివ రావు గతంలో నెల్లిమర్ల మండల మాజీ వైస్ ఎంపిపిగా సేవలు అందించడమే కాకుండా ప్రస్తుతం నగర పంచాయతీ కో ఆప్షన్ సభ్యులుగా, పట్టణ వైసిపి అధ్యక్షులుగా సేవలు అందిస్తున్నారు. జనవరి 6వ తేదిన పూసపాటిరేగ ఎఎంసి కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకారం నిర్వహించనున్నట్లు చిక్కాల తెలిపారు.

ఎండిఎం కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం మధ్యాహ్న భోజనం పథకం కార్మిక యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద కార్మికులంతా ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి బి.సుధారాణి మాట్లాడుతూ మూడు నెలలుగా బకాయిలు, జీతాలు చెల్లించకపోతే పథకాన్ని ఎలా నడపాలని ప్రశ్నించారు. వేతనం రూ.10వేలు ఇవ్వాలన్నారు. అనంతరం డిఇఒకు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో రామలక్ష్మి, లలిత, లక్ష్మి కార్మికులు పాల్గొన్నారు.

మెరకముడిదాం.. అభివృద్ధిలో ఆదర్శం

విద్యాశాఖ మంత్రి బొత్స • రోడ్లు, సచివాలయం, ఆర్‌బికె భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి-మెరకముడిదాం

జిల్లాలోనే అభివృద్ధిలో ఒక మోడల్ మండలంగా మెరకముడిదాం రూపొందుతోందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మండలంలోని ప్రతి గ్రామానికి రోడ్లు, తాగునీరు, విద్యాసంస్థలు, ఇతర కనీస వసతులన్నీ కల్పించడం ద్వారా ఈ మండలం జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ సాతంవలసలో శనివారం పర్యటించారు. జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చినప్పల నాయుడు, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మితో కలసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో సాగునీటి సౌకర్యం ఒక్కటే మిగిలి వుందని, అందుకు కూడా తగిన ఆలోచనలు చేస్తున్నామని చెప్పారు. సాతంవలస లో రూ.60 లక్షలతో ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సాతంవలస నుంచి పెరుమాలి వరకు రూ.2కోట్ల ఎం.ఎన్.ఆర్.జి.ఎస్. నిధులతో 3.3కిలోమీటర్ల బిటి రోడ్డును, నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం భవనాలను మంత్రి ప్రారంభించారు. మండలంలో గతంలో అసైన్డ్ భూములు ప్రభుత్వం నుంచి పొందిన 722 మంది భూమిలేని నిరుపేదలకు 760 ఎకరాల భూమిపై శాశ్వత భూహక్కు పట్టాలు పంపిణీ చేశారు. సెర్ప్ - ఉన్నతి మహిళాశక్తి పథకంలో భాగంగా ముగ్గురు ఎస్.సి. మహిళలకు ఒక్కొక్కరికి రూ.3.03 లక్షల వ్యయంతో వడ్డీలేని రుణం కింద మంజూరు చేసిన ఆటోలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి గ్రామంలో పలు ప్రభుత్వ పథకాల అమలుపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తమకు ఫించను మంజూరు చేయాలంటూ మంత్రికి విన్నవించగా వారికి ఫించను మంజూరుకోసం అవసరమైన చర్యలు చేపట్టాలని సచివాలయ సిబ్బందిని, వాలంటీర్లను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తదితరులు మాట్లాడారు. డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, చీపురుపల్లి ఆర్‌డిఒ బొడ్డేపల్లి శాంతి, పంచాయతీరాజ్ ఇఇ కెజిజెనాయుడు, డిఇ రమణమూర్తి, ఎంపిపి, జెడ్‌పిటిసి తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

పోలింగ్ స్టేషన్లలో మౌలిక సౌకర్యాలు

కచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించాలి : కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతులైన తాగు నీరు, టాయిలెట్లు, రాంప్‌లు, లైట్స్, తదితర ప్రాథమిక సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. వచ్చే మూడు రోజుల్లో సెక్టోరల్ అధికారులు, ఎఇఆర్‌ఒలు ప్రతి పోలింగ్ స్టేషన్ ను తనిఖీ చేసి మౌలిక వసతులపై ఖచ్చితమైన నివేదికను జనవరి 4 వ తేదీ నాటికి అందించాలని సూచించారు. శనివారం ఎన్నికల ఆర్‌ఒలు, ఇఆర్‌ఒలు, సెక్టోరల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 4 వ తేదీలోగా రిఆర్‌ఒ లాగిన్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. 80 శాతం పైబడి పోలింగ్ స్టేషన్లు ప్రభుత్వ పాఠశాలలోనే ఉన్నందున సదుపాయాల కల్పనకు అవసరమయ్యే నిధులను పాఠశాల నిర్వహణ నిధుల నుండి ఖర్చు చేయాలని తెలిపారు. వెంటనే ఆయా హెడ్ మాస్టర్లతో మాట్లాడుకొని, స్కూల్ నిర్వహణ కమిటీ అనుమతులు తీసుకోవాలని తెలిపారు. పనులన్నీ జనవరి 20 నాటికి పూర్తి చేసి మలి నివేదికను అప్‌లోడ్ చేయాలన్నారు. క్లెయిమ్స్ , అభ్యంతరాల డిస్పోజల్ కు గడువు పెంచినందున పెండింగ్ ఉన్న దరఖాస్తులన్నిటినీ ఈ 10 రోజుల్లో పూర్తిగా డిస్పోజ్ చేయాలని తెలిపారు. సమావేశంలో జెసి మయూర్ అశోక్, డిఆర్‌ఒ అనిత, డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర రావు, దొర, సుధారాణి, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గంజాయి నియంత్రణకు ప్రత్యేక చర్యలు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి దీపిక

- రహదారి భద్రతపై అవగాహన
- సెల్‌ఫోన్ల రికవరీలో ప్రథమ స్థానం
- భోగాపురం, ఎస్.కోట స్టేషన్ల అప్‌గ్రేడ్
- విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గంజాయి నిత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్‌పి ఎం.దీపికా పాటిల్ తెలిపారు. రహదారి భద్రతపై అవగాహన విస్తృత అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. సెల్‌ఫోన్ల రికవరీలో విజయనగరం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. భోగాపురం, ఎస్.కోట స్టేషన్ల అప్‌గ్రేడ్ చేశామని వివరించారు. తన ఛాంబర్‌లో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో 2023లో జిల్లాలో జరిగిన నేరాలు..పోలీసుశాఖ తీసుకున్న చర్యలు, సాధించిన విజయాల గురించి వివరించారు. గంజాయి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థులను, యువతను చైతన్యపర్చేందుకు కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. కన్విక్షన్ పోలీసింగులో భాగంగా పోక్సో మరియు కొన్ని తీవ్రమైన నేరాల్లో నిందితులు శిక్షింపబడే విధంగా చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో సివిల్ రైట్స్ డేను ప్రతీనెలా పాటిస్తూ, ప్రజలకు ఎస్‌సి, ఎస్‌టి చట్టం, పోక్సో, మహిళల రక్షణకు ఉపయోగపడే చట్టాల పట్ల అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టామని, ఫలితంగా ఎస్సీ, ఎస్టీలపై దాడులు తగ్గాయని తెలిపారు. 2023లో 11 పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు ఖరారయ్యాయన్నారు. రహదారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత కల్పించి, ఎన్‌ఫోర్సుమెంట్ కేసులు, ఎంవి నిబంధనలు అతిక్రమించిన వారిపైనా, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపైన కేసులు నమోదు చేయడంతో సత్ఫలితాలిస్తున్నా యన్నారు. మహిళా సంరక్షణ పోలీసుల ద్వారా ప్రజలకు లోన్ యాప్‌లు, దిశ ఎస్‌ఒఎస్. యాప్, సైబరు నేరాలు, తీసుకోవాల్సిన జాగ్రత చర్యల పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. పోయిన మొబైల్ ఫోనులను తిరిగి కనుగొనేందుకు ఫిర్యాదు దారులు పోలీసు స్టేషనుల చుట్టూ పదే పదే తిరగకుండా ప్రత్యేకంగా ఒక పోర్టల్ ను రూపొందించి, రాష్ట్రంలో మిగిలిన జిల్లాలకు ఆదర్శంగా నిలిచామన్నారు. ఈ పోర్టల్ కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 1100 మొబైల్స్‌ను తిరిగి స్వాధీనం చేసుకొని, బాధితులకు అప్పగించామన్నారు. గుర్ల పోలీసు స్టేషను పరిధిలోని ఎస్.ఎస్.ఆర్.పేట గ్రామానికి చెందిన నిందితులు ఎ.ఆర్ బెనిఫిట్ ఫుడ్ సంక్రాంతి కానుక (పప్పుల చిట్టీ) పేరుతో డిసెంబరు మాసంలో ప్రజలను మోసగించిన కేసును చేధించి, నిందితులను అరెస్టు చేసి, వారి ఆస్తులను అటాచ్ చేసి, వారి వద్ద నుండి రూ. 1.40 కోట్లు నగదును రికవరీ చేసామన్నారు. జిల్లాలో భోగాపురం, ఎస్.కోట పోలీసు స్టేషనులను అప్ గ్రేడ్ చేసామన్నారు. అదనంగా టాస్క్ ఫోర్స్ మరియు సోషల్ మీడియా సెల్ కు రెండు ఇన్స్పెక్టరు పోస్టులు మంజూరయ్యాయని ఎస్‌పి తెలిపారు. సమావేశంలో దిశ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, ట్రాఫిక్ డిఎస్‌పి డి.విశ్వనాథ్, డిసిఆర్‌బి సిఐ కెకెవి విజయనాథ్, డిసిఆర్‌బి సిఐ జె. మురళి పాల్గొన్నారు.

ఆందోళనలో వేతన జీవులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, సామాజిక భద్రత కల్పించాలని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వివిధ రంగాలకు చెందిన స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఆందోళన చేస్తుండగా, ఎన్నికల్లో మరోసారి అధికారాన్ని చేజిక్కించుకునే దిశగా ప్రభుత్వం ప్రచార పర్వంలో మునిగిపోయింది. వేతన జీవుల ఆవేదన, ఆక్రందన పక్కనబెటి ఆసరా, చేయూత పేరిట ప్రజల్లో పరోక్షంగా ఎన్నికల ప్రచారానికి తెరలేపింది. ఉద్యోగులు, కార్మికుల సమ్మెలను, సమస్యలను పక్కనబెట్టి నేలవిడిచి సాము చేసినట్టుగా వ్యవహరించడంతో సగటు ప్రజానీకం నివ్వెరబోతున్నారు. పైగా ఎన్నికల హామీలన్నీ నెరవేర్చినట్టుగా ఎమ్మెల్యేలు, మంత్రులు బుకాయిస్తుండడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేపట్టి సుమారు 20రోజులు కావస్తోంది. వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతునే ఉన్నారు. వీరిపట్ల సానుకూలంగా వ్యవహరించాల్సిన ప్రభుత్వం సచివాలయం ఉద్యోగులతో తెరిపించి అబాసుపాలైంది. పిల్లల తల్లిదండ్రులు సైతం అంగన్‌వాడీలకు సంఘీభావం తెలియజేయడంతో అటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇటు అధికారులు నాలుక కరుచుకున్నారు. పైగా తెలంగాణాలో పెంచిన ప్రతిసారి అంగన్‌వాడీలకు వేతనాలు పెంచుతామని చెప్పలేదంటూ జిల్లాకు చెందిన విద్యాశాఖ మంత్రి సమర్థించుకున్నారు. దీంతో, అంగన్‌వాడీలు తగ్గేదేలే అన్నట్టుగా మొక్కవోని దీక్షతో సమ్మెను ముందుకు నడుపుతున్నారు. ఈనేపథ్యంలోనే రాష్ట్ర వ్యాప్తంగా మంత్రుల ఇళ్ల ముట్టడిలో భాగంగా శనివారం మంత్రి బొత్స ఇంటి వద్ద బైఠాయించారు. వీరి స్ఫూర్తితో సర్వశిక్షాభియాన్ పరిధిలోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కెజిబివి ఉపాధ్యాయులు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సైతం సమ్మెలోకి దిగారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూన్నారు. వీరే గాక విఆర్‌ఎలు, మధ్యాహ్న భోజన పథకం



కార్మికులు, ఆశావర్కర్లు, మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ఔట్ సోర్సింగ్ కార్మికులు ఎక్కడికక్కడ నిరసన తెలుపుతున్నారు. వీరే కాదు సచివాలయ వాలంటీర్లు సైతం తమకు రూ.18వేలు వేతనం ఇవ్వాలంటూ సమ్మె నోటీసులు అందజేయడంతో అధికార పార్టీ నాయకులు షాక్‌కు గురయ్యారు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కూడా పిఆర్‌సి, డిఎ బకాయిలు కోసం ధర్నాలు చేపడుతున్నారు. వీరు కోరుతున్నవేవీ గొంతెమ్మ కోర్కెలు కాదు. ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలతోపాటు కనీస వేతనాలు, సదుపాయాలు, ఉద్యోగ భద్రత వంటి అంశాలనే అమలు చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆయా విభాగాల సేవలు ఎక్కడికక్కడ స్తంభిస్తున్నాయి. మున్సిపల్ కార్మికుల సమ్మెతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతోంది. ఇటువంటి పరిస్థితుల్లో కార్మికులు, ఉద్యోగుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం లేదు సరికదా ఆసరా, చేయూత పథకాల అమలు పేరిట 1వ తేదీ నుంచి జనాల్లోకి వెళ్లేందుకు నిర్ణయించింది. 3వ తేదీన పెంచిన అసరా పించన్లు పంపిణీ సిఎం జగన్‌మ్మోహన్‌రెడ్డి వర్చువల్ పద్ధతిలో ప్రారంభిస్తారట. ఆ రోజు అన్ని సచివాలయాల్లోనూ టీవీలు ఏర్పాటు చేసి మరీ లబ్ధిదారులను హాజరుపర్చాలని మంత్రి బొత్స ఆదేశాలు జారీచేశారు. దానికి ముందు 1, 2వ తేదీల్లో వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం పథకాల ద్వారా వారికి చేకూరిన లబ్ధిని వివరించాలని ప్రభుత్వం ఒత్తిడిచేస్తోంది. 4వ తేదీ నుంచి ప్రతి నియోజకవర్గంలోనూ రోజుకో మండల కేంద్రంలో పండగ వాతావరణంలో సభలు నిర్వహించాలని మంత్రి దిశానిర్ధేశం చేశారు. విందు, వినోద కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాలు 8వ తేదీ వరకు జరుగుతాయి. ఆ తరువాత చేయూత కార్యక్రమం ఫిబ్రవరి 25వ తేదీ వరకు చేయూత పథకంపై ప్రచారం చేపట్టనున్నారు. దీన్నిబట్టి సమ్మెలు, ఉద్యోగులు, స్కీమ్ వర్కర్ల సమస్యలు, బాధలు ప్రభుత్వానికి పట్టలేదని, వ్యతిరేకతను కప్పించుకునేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలపై ప్రచారానికి తెరలేపిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

వచ్చేది టిడిపి ప్రభుత్వమే

మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

రాబోయేది టిడిపి ప్రభుత్వమేనని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి కోళ్ల లలితకుమారి అన్నారు. పట్టణంలోని శ్రీనివాసకాలనీలో వార్డు మెంబర్ పెదగాడ రాజు, గుడుపు బ్రహ్మాజీ, కాపుగంటి వాసు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బాబు షూరిటి - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో లలితకుమారి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజలకు మినీ మేనిఫెస్టో పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, భీసెట్టి అరుణ, పట్టణ అధ్యక్షులు కె.మల్లేశ్వరరావు, నానిగిరి రమణాజీ, ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి చక్కా కిరణ్ కుమార్, అనకాపల్లి చెల్లయ్య, వార్డు మెంబర్ పెదగాడ లక్ష్మి పాల్గొన్నారు.


85 శాతం హామీలు నెరవేర్చలేదు

జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 85 శాతం నెరవేర్చలేదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోళ్ల లలితకుమారి ఆరోపించారు. పట్టణంలోని అన్న కేంటీన్ వద్ద విలేకరులతో ఆమె మాట్లాడారు. 730 హామీల్లో 109 మాత్రమే అమలు చేశారని తెలిపారు. 85 శాతం హామీలు విస్మరించి రాష్ట్ర ప్రజలను నమ్మించి, వంచించడమేనా జగన్ రెడ్డి నీతి, నిజాయితీ, నిబద్ధత? అని ప్రశ్నించారు.

ఆ చట్టంతో రైతులకు అన్యాయం

ప్రజాశక్తి-వేపాడ

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూ యాజమాన్యపు హక్కు చట్టంతో రైతులకు అన్యాయం జరుగుతుందని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులు కె.చిన్నకోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చట్టం చేయడంలో రాజ్యాంగంలో పలు అంశాలను ధిక్కరించే విధంగా ఉందని తెలిపారు. వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేసే విధంగా న్యాయస్థానాన్ని కోరుతూ పిల్ వేసినట్లు చెప్పారు. భూయాజమాన్యపు హక్కు చట్టంతో తాత ముత్తాతల నుంచి అనుభవిస్తున్న భూములపై హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని, దీనిపై ప్రతిఒక్కరూ పార్టీలకతీతంగా న్యాయ పోరాటానికి సహకరించాలని కోరారు.



ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

జగన్‌ను మరోసారి గెలిపించుకోవాలి

ప్రజాశక్తి - భోగాపురం

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని మరోసారి సిఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని చాకివలస గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గ్రామ మాజీ సర్పంచ్ లంక రామునాయుడు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గడపగడపకు వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ప్రభుత్వం వచ్చాక వారికి వచ్చిన పథకాల గురించి బుక్‌లెట్‌లోని వివరాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం పథకాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి, ఎంపిడిఒ అప్పలనాయుడు, తహశీల్దార్ బంగార్రాజు, సర్పంచ్ వెంకటలక్ష్మి, నాయకులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పడాల శ్రీనివాసరావు, భాను, సుందర హరీష్, మైలపల్లి నరసింహులు, ఉప్పాడ విజయభాస్కర రెడ్డి, వాసుపల్లి రెయ్యుడు, కొల్లి రామ్మూర్తి, దాసరి చంద్రశేఖర్ రెడ్డి, ఎ.పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

డైట్ లెక్చరర్‌కి డాక్టరేట్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా సంస్థ (డైట్) లెక్చరర్‌గా పనిచేస్తున్న కందిపల్లి రామకృష్ణారావు డాక్టరేట్ డిగ్రీ పొందారు. ఈ మేరకు శనివారి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ డిగ్రీ ప్రధానం చేసింది. రామకృష్ణారావు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నిర్వహించిన 'పాఠశాల యాజమాన్యం పని తీరు' అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ డిగ్రీ పొందారు. డైట్ ప్రిన్సిపాల్ ఎన్. తిరుపతి నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ యు. మాణిక్యం నాయుడు, అధ్యాపక బృందం, సిబ్బంది అభినందించారు.

చక్కని ఆరోగ్యానికి ఊపిరితిత్తులు కీలకం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రతి ఒకరు చక్కని ఆరోగ్యానికి నిత్యం వ్యాయామం చేయడం ద్వారా ఊపిరితిత్తులు కాపాడుకోగలమని వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి అన్నారు. శనివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో కార్డియో పల్మోనరీపై కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చక్కని పోషక విలువలు వున్న ఆహారం, మంచి జీవనశైలి కలిగి ఉండాలన్నారు. ఈ కార్యశాలకు వైద్యులు సివికెకె చైతన్య, శ్రీలక్ష్మి నిపుణులుగా వ్యవహరించారు. పారా మెడికల్ విద్యార్థులు ప్రాథమిక చికిత్సలో నైపుణ్యం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ పి ఎస్‌వి రమణారావు, డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డీన్ డాక్టర్ సన్నీ డయాల్, కళ్యాణ్, మజీద్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌పై అవగాహన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమంపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకొని, పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ సాధికార అధికారి టి.చంద్ర శేఖరరావు కోరారు. కిల్తంపాలెం పంచాయతీ కొత్తపాలెం గ్రామంలో ఆదివాసీ గదబ తెగకు చెందిన 36 కుటుంబాలకు శనివారం గ్రామసభ ఏర్పాటు చేసి అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కేంద్ర ప్రభుత్వ పథకం గురించి వివరించారు. పివిటిజి సమూహాలకు చెందిన పేద గిరిజనులు ప్రతీ కుటుంబానికి పక్కా ఇల్లు, ప్రతీ ఇంటికి మంచినీటి కుళాయి, విద్యుత్, పౌష్టికాహారం, ఆరోగ్యం, జీవనోపాధి మెరుగు పర్చడం, నైపుణ్య వికాసం, నాణ్యమైన విద్య, గ్రామంలో రహదారుల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకాన్ని అర్హులంతా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ. సి.హెచ్.చినబాబు, మండల సమన్వయ కర్తలు టి.కృష్ణ, వి.సంతోష్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అన్నదానానికి మిమ్స్ ఛైర్మన్ అల్లూరి సత్య నారాయణరాజు ఆర్థిక విరాళం అందించారు. శనివారం కొత్తపేటలో శ్రీ రమా సహిత వీరవెంకట సత్యన్నారాయణ స్వామి ఆలయంలో శ్రీ రామ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, కీర్తి శేషులు అల్లూరి మూర్తి రాజు, లక్ష్మి కాంతమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు మిమ్స్ ఛైర్మన్ అల్లూరి సత్యన్నారాయణరాజు (బాబి) అన్నదానానికి విరాళం అందించారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం గ్రామానికి చెందిన జనసేన నాయకులు పల్లంట్ల జగదీష్ తన సొంత సొమ్ముతో 200 మంది వృద్ధులకు శనివారం దుప్పట్లను పంపిణీ చేశారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నెల్లిమర్ల జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ లోకం మాధవి చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు. టిడిపి, జనసేన ప్రభుత్వం వస్తే రాష్ట్ర ప్రజలకు మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. అందుకు రానున్న రోజుల్లో ఈ ప్రభుత్వాన్ని గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్ల రాంబాబు, పిడుగు జోగారావు, బొల్లు త్రినాథ్, సిరిగుడి వెంకటేష్, అడపా సుబోషాణరావు, జమ్మిరాజు, శేఖర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సత్య కళాశాలలో నూతన సంవత్సర వేడుకలు

విజయనగరం : స్థానిక తోట పాలెంలో గల సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి, అధ్యాపకులు, విద్యార్థులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియ జేసుకున్నారు. డైరెక్టర్ శశి భూషణ రావు మాట్లాడుతూ గతం ఎంతో బాగుంటుందని అందుకే 2023కు ఆనందంగా వీడ్కోలు చెబుతూ 2024 నూతన సంవత్సరాన్ని సాదరంగా ఆహ్వానిద్దామని అన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది విధ్యార్థులు పాల్గొన్నారు.

ఐదో రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

బొబ్బిలిలో మున్సిపల్ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపల్ కార్యాలయాన్ని మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు ముట్టడించారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన సమ్మె ఐదోరోజు శనివారం కొనసాగింది. కౌన్సిల్ సమావేశం నిర్వహించడంతో కాంట్రాక్టు కార్మికులు మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించి, గేట్లకు తాళం వేసి, సమావేశానికి వచ్చిన చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణను అడ్డుకున్నారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని కౌన్సిల్ తీర్మానించాలని చైర్మన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కార్మికులు గేట్లు తీసి లోపలికి విడిచిపెట్టారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేసే వరకూ పోరాటం చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు గౌరీష్ హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

మున్సిపల్ చెత్త వాహనం అడ్డగింత

ప్రయివేట్ డ్రైవర్‌తో నడుపుతున్న మున్సిపల్ చెత్త వాహనాన్ని పట్టణంలోని బజారువీధిలో కాంట్రాక్టు కార్మికులు అడ్డుకున్నారు. మున్సిపల్



విజయనగరంలో ఒంటి కాలిపై నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు





బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణను అడ్డుకుని నిలదీస్తున్న కార్మికులు ; రాజాంలో నల్లదుస్తులు, నల్ల జెండాలతో ర్యాలీ చేపడుతున్న నగర పంచాయతీ కార్మికులు

కాంట్రాక్టు కార్మికులు సమ్మెలో ఉండడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రయివేట్ డ్రైవర్‌తో చెత్త వాహనాన్ని అధికారులు నడపడంతో కాంట్రాక్టు కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా ప్రయివేట్ వ్యక్తులను పనిలో పెట్టుకుంటే అడ్డుకుంటామని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షులు గౌరీష్ హెచ్చరించారు.

రాజాం : పట్టణంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్.రామ్మూర్తి నాయుడు ఆధ్వర్యాన నల్ల జెండాలు, దుస్తులతో కార్మికులు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఫెడరేషన్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, అనిల్‌కుమార్, లక్ష్మి, గురువులు, రాంబాబు, వెంకటి, గోపి, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద చేపడుతున్న సమ్మె శిబిరాన్ని టిడిపి నాయకులు సందర్శించి, మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు, టిడిపి కౌన్సిలర్లు అవనాపు సత్యనారాయణ, లెంక హైమావతి, కింతాడ కళావతి, ముడిమంచి లక్ష్మి, నరవ రామలక్ష్మి, మజ్జి అన్నపూర్ణ, టిడిపి నాయకులు పొడుగు కృష్ణ వేణి, ముడుమంచి లక్ష్మణ, మజ్జి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె ఐదో రోజుకు చేరుకుంది. సమ్మెను విచ్చిన్నం చేసేందుకు పోటీ కార్మికులు తీసుకొచ్చి అడ్డుకున్న నాయకత్వాన్ని అరెస్టులు చేసి నిర్బంధించడాన్ని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) వ్యతిరేకిస్తుందని యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు తెలిపారు. శనివారం విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని ఒంటి కాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. మున్సిపాలిటీల్లో పని చేస్తున్న పారిశుధ్య, వాటర్ వర్క్స్, విలీన ప్రాంత, పంప్ హౌస్ , ఎలక్ట్రికల్ కార్మికులు, క్లాప్ డ్రైవర్లలో అత్యధికులైన దళితులు, వెనుకబడిన తరగతులపై యుద్ధం ప్రకటించడమేనా ఈ ప్రభుత్వ సామాజిక సాధికారత అని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో రామచంద్రరావు, రాఘవ, రామారావు, వంశీ, శ్రీను, బాబురావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల అక్రమాలపై చర్యలేవి?

కౌన్సిల్ సమావేశంలో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల నిలదీత

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాల అక్రమాలపై చర్యలు తీసుకోవడంలో జాప్యమెందుకని అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు.. చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, అధికారులను నిలదీశారు. కౌన్సిల్ హాల్లో శనివారం చైర్మన్ మురళీకృష్ణ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి కౌన్సిలర్ రాంబార్కి శరత్, మున్సిపల్ వైస్‌చైర్మన్ చెలికాని మురళి.. ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలపై నిలదీశారు. శరత్ మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాలను అధికార పార్టీకి చెందిన వారు ఆక్రమిస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వైస్ చైర్మన్ చెలికాని మురళి మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాలు ఆక్రమణల వల్ల ప్రభుత్వానికి, వైసిపికి, ఎమ్మెల్యేకు చెడ్డపేరు వస్తుందని, తక్షణమే ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ కాలనీలో ఎన్ని ఇళ్ల స్థలాలు ఖాళీగా ఉన్నాయి, ఎన్ని ఆక్రమణకు గురయ్యాయి, ఆక్రమణకు గురైన వాటిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారు, పట్టణంలో ఎక్కడెక్కడ మున్సిపల్ స్థలాలు ఉన్నాయి, అవి ఎవరు ఆధీనంలో ఉన్నాయో వారంలో చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై టిపిఒ వరప్రసాద్ స్పందిస్తూ ఇందిరమ్మ కాలనీలో 16 పునాదులను తొలగించామని చెప్పారు. ఖాళీ స్థలాలపై రెవెన్యూ అధికారులను వివరాలు అడిగామని, వచ్చిన వెంటనే చెపుతామని వెల్లడించారు. అభివృద్ధి పనులు వేగవంతం



సమావేశంలో వాగ్వివాదానికి దిగిన అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు

చేయాలని, బోర్లు, కుళాయిలు వేయాలని కౌన్సిలర్లు కోరారు.

కో-ఆప్షన్ సభ్యులపై సస్పెన్షన్ వేటు

శ్మశానవాటిక, వ్యక్తిగత సమస్యపై సమావేశంలో మాట్లాడేందుకు ప్రయత్నించిన మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రియాజ్ ఖాన్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ముస్లిముల శ్మశానవాటికలో అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, టిటిడి వద్ద తన షాపు తొలగించడం అన్యాయమని ఆయన అన్నారు. దీనిపై వైసిపి కౌన్సిలర్లు పి.ఉమ, ఇంటి గోవిందరావు, ఎస్.రామకృష్ణబాబు అభ్యంతరం చెప్పడంతో గందరగోళం నెలకొంది. కో-ఆప్షన్ సభ్యులు ఖాన్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు చైర్మన్ మురళి ప్రకటించిడంతో ఖాన్‌ను మున్సిపల్ సిబ్బంది బయటకు నెట్టివేశారు. కౌన్సిల్ హాల్ బయటన ఖాన్ నిరసన తెలిపారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ కౌన్సిల్ తీర్మానించి, ప్రభుత్వానికి పంపాలని టిడిపి కౌన్సిలర్ రాంబార్కి శరత్ కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె జరుగుతుందని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్మానం చేయకూడదని వైస్ చైర్మన్ చెలికాని మురళి తెలిపారు. ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాల ఆక్రమణలు, మున్సిపల్ కార్మికుల సమస్యలపై టిడిపి, వైసిపి కౌన్సిలర్ల మధ్య వాగ్వివాదం జరిగింది.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక గంటి ప్రసాదం భవనంలో శనివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవలను ప్రశంసించారు. సామాజిక కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ ముందుంటుందని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జెసి రాజు, వి.శ్రీహరి, ఎన్ఆర్ఐ ఆస్పత్రి సిఇఒ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. వైద్య శిబిరంలో 229 మందికి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు ఎం.శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులే

ప్రజాశక్తి-రామభద్రపురం

నూతన సంవత్సర వేడుకలను నియమిత వేళల్లోనే జరుపుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ సురేంద్రనాయుడు తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఆయన మాట్లాడారు. నూతన సంవత్సర వేడుకల్లో అపశ్రుతులకు చోటివ్వకుండా యువత ఆనందంగా జరుపుకోవాలని కోరారు. రోడ్లపై అరుపులు, కేకలు వేస్తూ ప్రజలకు నిద్రాభంగం కాకుండా చూడాలన్నారు. బహిరంగ మద్యపానం, ద్విచక్ర వాహనాలను అతివేగంగా నడపడం, అదేపనిగా హారన్లు మోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్నేహపూర్వక వాతావరంలో వేడుకలు జరుపుకోవాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయానిదే భవిష్యత్తు

ప్రజాశక్తి - వంగర

రానున్న రోజుల్లో ప్రకృతి వ్యవసాయానిదే భవిష్యత్తు అని ఆరోగ్యవంతమైన సమాజం కోసం రైతులను ప్రకృతి సేద్యంపై చైతన్య పరిచేందుకు మేధావులు విద్యావంతులు ఉపాధ్యాయులు ప్రకృతి ప్రేమికులు సమాయత్తం కావలసిన అవసరముందని ప్రకృతి వ్యవసాయ రైతు పెంకి గౌరీశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని యం. సీతారాంపురం ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతులకు శనివారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వారినుద్దేశించి మాట్లాడుతూ విచక్షణా రహితంగా అవసరానికిమించి రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించడం వల్ల భూమి నిస్సారమై రానురాను రైతుకు పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందన్నారు. అవగాహన సదస్సులో హెచ్‌ఎం. పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

ప్రజాశక్తి - జామి

జామి మండల పరిషత్తు సాధారణ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. మండల సమస్యలు, ధాన్యం రైతుల ఇబ్బందులు చర్చకు రాకపోవడం గమనార్హం. ప్రధానంగా జామి మండలం వ్యవసాయాధారిత కుటుంబాలు ఎక్కువ. దాదాపుగా ప్రతి కుటుంబం ధాన్యం కొనుగోలు ఇబ్బందులు చవిచూసే పరిస్థితి. ఇప్పటికే మండల కేంద్రానికి చెందిన పలువురు రైతులు ధాన్యం కొనుగోలు సమస్యలపై జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో మండల సర్వసభ్య సమావేశం వేదికగా సమస్యలపై చర్చకొస్తుందని మండల రైతులు భావించారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపిపి సబ్బవరపు అరుణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు హాజరయ్యారు.

చర్చకురాని సమస్యలు

సమావేశంలో వ్యవసాయ శాఖ, పౌరసరఫరాలు, విద్యాశాఖ, డిఆర్‌డిఎ, మహిళా సాధికారత, వైద్య ఆరోగ్య శాఖ, గృహనిర్మాణం తదితర శాఖల ప్రగతిపై నామమాత్రపు సమీక్ష చేశారు. ఒకరిద్దరు సభ్యులు వ్యవసాయ శాఖ సమస్యలపై ప్రశ్నలు వేయడానికి పరిమితం అయ్యారు. కానీ ధాన్యం కొనుగోలులో మిల్లర్లు అదనపు ధాన్యం వసూళ్లకు పాల్పడుతున్న నేపథ్యంలో సమస్యల పరిష్కారంపై పూర్తి స్థాయి చర్చ జరగలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

డిఆర్‌డిఎ, వైకెపి, మహిళా సాధికారతపై జరిగిన చర్చలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ మహిళలను, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని, సమావేశ పరచి సున్నావడ్డీ, చేయూత పథకాల విధివిధానాలు, అమలుతీరు వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి గొర్లె సరయు, వైస్ ఎంపిపిలు గేదెల వెంకటరావు, ఎన్నింటి విజయలక్ష్మి, ఎంపిడిఒ, తహశీల్దార్, తదితరులు పాల్గొన్నారు.

రైతుబిడ్డలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి- రేగిడి

సమాజంలో వ్యవసాయ పరిస్థితులు గండుకాలంగా ఉన్నాయని, అందుకు రైతు బిడ్డలే పారిశ్రామిక వేతలగా ఎదిగి ఉపాధి అవకాశాలు కల్పించాలని శాస్త్రవేత్త, పల్సాస్ గ్రూప్ ఆఫ్ అధినేత గేదెల శ్రీనుబాబు అన్నారు. శనివారం ఉంగరాడ మెట్ట వద్ద శ్రీ విజయ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ దూబ పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రైతు బిడ్డ సమాజానికి ఉపయోగపడే విధంగా తయారు కావాలన్నారు. వలస నివారణకు స్థానిక వనరులు సృష్టించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తరాంధ్రకు సాగునీరు అందించడంలో విఫలమయ్యాయని అందుకు ప్రధానమంత్రి మోడీకి ఉత్తరాంధ్ర సమస్యలను వివరించినట్లు వెల్లడించారు. ఉత్తరాంధ్రలో 30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవలసి ఉండగా, కేవలం 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్ర చుట్టూ నీరు ఉన్నప్పటికీ సాగునీరుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో రోగులకు డాక్టర్ సాయికృష్ణ, ఎమ్మెస్ జనరల్ సర్జన్ డాక్టర్ సాయి శంకర్, ఎండి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వీణ



మందులు పంపిణీ చేస్తున్న పారిశ్రామిక వేత్త శ్రీనుబాబు

సరస్వతి, ఎండి పీడియాటిక్స్ డాక్టర్ విజయ్ శ్రీ, గైనకాలజిస్ట్, శ్రీ విజయలు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 521 మంది రోగులు తనిఖీ చేసుకున్నారు. అవసరమైన రోగులకు ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బూర్జ మాజీ జెడ్‌పిటిసి అనెపు రామకృష్ణ నాయుడు, బిజెపి మన్యం జిల్లా నాయకులు టంకాల దుర్గారావు, దూబ రాంబాబు, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి నుంచి ఉపశమనానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని విజ్జి స్టేడియంలో పోలీసు శాఖకు విజయనగరం కింగ్స్, పార్వతీపురం మన్యం పోలీసుశాఖకు చెందిన పార్వతీపురం పయనీర్స్ మధ్య ఆదివారం 30న క్రికెట్ మ్యాచ్ రసవత్తరంగా సాగింది. నిరంతర విధులు, ఒత్తిడి నుండి ఉపశమనం పొందేందుకు ఎస్‌పి ఎం.దీపిక ఆధ్వర్యాన విజయనగరం కింగ్స్, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్‌పి విక్రాంత్‌పాటిల్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు క్రికెట్ పోటీలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొని, క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ నిరంతరం విధులు నిర్వహిస్తూ, ఎంతో ఒత్తిడి గురయ్యే పోలీసులకు పోటీలు నిర్వహించి క్రీడా స్ఫూర్తిని నింపారన్నారు. టాస్ గెలిచి బ్యాటింగు ఎంచుకున్న విజయనగరం కింగ్స్ 20 ఓవర్లలో 8 వికెట్లును కోల్పోయి 147 పరుగులు సాధించారు. 148 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగు ప్రారంభించిన పార్వతీపురం పయనీర్స్ 18.1 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 149 పరుగురు చేసి విజయం సాధించింది. ముగింపు వేడుకల్లో ఇరు జిల్లాల ఎస్‌పిలు మాట్లాడారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో కూడా సమిష్టిగా పని చేసి, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని పోలీసు అధికారులను, సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో పలువురు డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

11వ రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె 11వ రోజుకు చేరుకుంది. సమ్మె సందర్భంగా శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా శిబిరంలో మోకాళ్ళపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష జెఎసి జిల్లా అధ్యక్షులు గురువులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలుచేయాలని కోరుతుంటే సమస్యలు పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. మరో వైపు సమస్యలు పరిష్కారం చేయకుండా కెజిబివి ఉద్యోగులకు మెమోలు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఏ ఒక్క ఉద్యోగిపై చర్యలు తీసుకున్నా తామంతా మూకుమ్మడిగా ఉద్యోగ బాధ్యతలను నుంచి తప్పుకుంటామని హెచ్చరించారు 11 రోజులుగా

మోకాళ్లపై నిల్చొని నిరసన

సమ్మె చేస్తున్న ప్రభుత్వం సమస్యలు పరిష్కారం కోసం ముందుకు రాకపోవడం చాలా దారుణమన్నారు.

జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కల్పించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి ప్రతి నెలా 1వ తేదీకి వేతనాలు చెల్లించి, వార్షిక బడ్జెట్ ఒకేసారి విడుదల చేయాలన్నారు.వేతనంతో కూడిన మెడికల్ లీవులుమంజూరు చేయాలని, గ్రాడ్యుటీ మరియు 20లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి 2024 కేలండర్‌ను స్థానిక ఎంపిపి కార్యాలయంలో శనివారం ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక, జెడ్‌పిటిసి గార తవుడు ఆవిష్కరించారు. మండల ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

- ప్రజాశక్తి, గజపతినగరం